ప్రజాశక్తి

మంగళవారం 3 జనవరి 2023

5


శ్రీ సత్యసాయి





స్పందనలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

అనంతపురం జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాల వార్తలు వింటూనే ఉంటున్నాం. ఈ ప్రమాదాలకు వాహనదారుల అతివేగం ఒక కారణమైతే, కొన్ని చోట్ల రోడ్డు నిర్మాణాలు, మలుపులు కారణమవుతున్నాయి. అత్యధికంగా జరిగే ప్రాంతాలు, నిర్మాణాల్లో ఉన్న లోపాలను 'బ్లాక్ స్పాట్స్'గా చెబుతుంటారు. ఈ బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించినప్పటికీ రహదారి నిర్మాణాల్లో మార్పులు చేపడుతున్న దాఖలాలు నామమాత్రంగానే అని చెప్పాలి. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాల్లో ఈ బ్లాక్ స్పాట్స్‌పై చర్చించడం జరుగుతుంది. అయితే దాని తరువాత మార్పులు మాత్రం కొన్ని సంవత్సరాలైనా చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





- రోడ్లపై వరుస ప్రమాదాలు
- రోజుకు సగటున ఒక ప్రమాదం
- ప్రాణాలు పోతున్నా చేపట్టని చర్యలు
- రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల గుర్తింపుతోనే సరి

తొలగని బ్లాక్‌స్పాట్స్..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ప్రతి రోజూ ఏదోక చోట ప్రమాద ఘటన చోటు చేసుకుంటూనే ఉంది. సగటున రోజుకు ఒకటి నుంచి రెండు ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు అధికారుల రికార్డులే చెబుతున్నాయి. 2022 సంవత్సరంలో జనవరి నుంచి డిసెంబరు వరకు జరిగిన ప్రమాద ఘటనలు జిల్లాలో 533 ఉన్నాయి. అంటే సగటున రోజుకు 1.4 ఘటనలు జరుగుతున్నాయి. అంటే ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో మొత్తం చనిపోయిన వారు 321 మంది అంటే ఇంచుమించు రోజుకు ఒకరు చొప్పునే చనిపోతున్నారు. 576 మంది గాయపడ్డారు. అంటే ఇద్దరు చొప్పున ప్రమాదం బారినపడుతున్నారు. ఇలా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుని తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నా వాటి నివారణకు తీసుకోవాల్సినన్ని చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

15 ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్

జిల్లాలో ప్రధానంగా 15 ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. ఇందులో నాలుగు అత్యంత ప్రమాదకరంగానున్నవి అనంతపురం నగరం చుట్టూనే ఉన్నాయి. చెన్నై హైవే నుంచి బెంగళూరుకు హైవేకు కలిపితే కొత్తగా నిర్మించిన రహదారి రాప్తాడు వద్ద కలుస్తుంది. ఇక్కడ హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వైపునకు వెళ్లే



రాప్తాడు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్‌ఫొటో)

వాహనాలు వేగంగా వెలుతుంటాయి. అదే ప్రాంతంలో అడ్డంగా చెన్నై వైపు నుంచి ఎన్‌హెచ్44 పైకి ఎక్కనున్నాయి. ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా ఉందని గుర్తించారు. అయితే రహదారి నిర్మాణంలో ఎటువంటి మార్పుల్లేకుండానే కొనసాగిస్తున్నారు. ఇక రెండో ప్రాంతం తపోవనం వద్దనున్న ఎన్‌హెచ్44 ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం లేకపోవడం, నేరుగా జాతీయ రహదారిపైకి నగరంలోకి వెళ్లే వాహనాలు అటు, ఇటు వెలుతుంటాయి. ఇక్కడ కూడా అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. సాయంత్రం సమయాల్లో రద్దీ కూడా అధికంగా ఉంటోంది. ఇక్కడ అండర్‌పాస్‌గానీ, ఓవర్ బ్రిడ్జిగాని నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. దీని తరువాత పంగల్ రోడ్డు, ఇది కూడా ప్రమాదకరంగానే ఉంది. ఇక్కడ మార్పులు చేపట్టాల్సి ఉంది. దీంతోపాటు ఇతర ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. వీటిని నాలుగైదు రోడ్డు సేఫ్టీ సమావేశాల్లోనూ చర్చించినప్పటికీ చర్యలు మాత్రం నామ మాత్రంగానే ఉంటున్నాయి. ప్రజల ప్రాణాలు మాత్రం గాల్లో కలసిపోతూనే ఉన్నాయి.

చర్యలు తీసుకుంటున్నారు

జిల్లాలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించాం. కొన్ని చోట్ల మార్పులకు ఇంజినీరింగు విభాగం వారు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.1.50కోట్ల వరకు నిధులు విడుదలై ఉన్నాయి. మరికొన్ని చోట్ల మార్పులు జరగాల్సి ఉంది. వాటిపైనా జనవరి 4వ తేదీన జరిగే సమావేశంలోనూ చర్చించి తగిన చర్యలు చేపడతాం.

శివరాం ప్రసాద్ , డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్.

ప్రభుత్వ భవన నిర్మాణ పనులను

వేగవంతం చేయండి

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత గల భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పరిష్కరించి పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలు హెల్త్ క్లీనిక్‌లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సకాలంలో పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గడపగడపకులో వచ్చే వినతులకు పరిష్కారం చూపాలన్నారు. నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన వివిధ అభివద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 88 అర్జీలను అధికారులు స్వీకరించారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఏర్పాటు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీని నియమించినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఇందులో కలెక్టర్‌కు జిల్లా అధ్యక్షుని హోదా కల్పించారు. అడహాగ్ కమిటీ ఛైర్మన్‌గా జిఎం.శేఖర్, వైస్ ఛైర్మన్‌గా పోల లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి, కోశాధికారిగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ జిబి.విశ్వనాథ్, కమిటీ సభ్యులుగా తల్లపల్లి భయారెడ్డి, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కనకే రాజు, సాయి దర్శిని, రంజిత దేవి, పశిరి శంకర్ రావు, రఘునాథరెడ్డి, నాగరాజు, బోయ ఆదినారాయణ, నియమితులయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా జిల్లాలో కార్యక్రమాలు చేపడతామన్నారు.



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న డిఇఒ మీనాక్షి,ఉపాధ్యాయులు

జాతీయ పోటీలకు ధర్మవరం విద్యార్థి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గతనెల 29 నుంచి 31వ తేదీ వరకు కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిరంజీవి ప్రతిభ కనబరచి జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం శైలజ తెలిపారు. ఈమేరకు సోమవారం డిఇఒ మీనాక్షి విద్యార్థిని అభినందించారు. చిరంజీవి త్వరలో జరిగే జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని పీడీలు నాగేంద్ర, నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, తులసీ, శ్రీనివాసులు, శంకర్ నారాయణ, ప్రసాద్‌బాబు, రామకృష్ణ, నాగరాజు, హరిక్రిష్ణ, దివాకర్, రామాంజినేయులు, నాగేంద్ర, శ్రీనివాసులు, రపిక్ అహమ్మద్, లీలావతి ఉన్నారు.

పేదల కడుపు కొట్టిన వైసిపి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి అధికారంలోకి వచ్చాక అన్నాక్యాంటీన్లు మూసివేసి పేదల కడుపుకొట్టిందని టిడిపి నాయకులు విమర్శించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పుట్టపర్తి మండలం కమ్మవారిపల్లికి చెందిన ఊరువాకిలి సురేష్ సహకారంతో టిడిపి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులతోపాటు, ముక్కోటి ఏకాదశికి తరలివచ్చిన భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేపట్టినట్లు తెలిపారు. 24 రోజులుగా ప్రతి సోమవారం పేదలకు అన్న క్యాంటిన్ ద్వారా పేదలకు భోజన సదుపాయాన్ని కల్పిసున్నామన్నారు. కాగా రాష్ట్రంలో వైసిపి వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి మండలానికీ అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల కడుపు నింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోత్తంగౌడ్, పరిశే సుధాకర్, పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్, సిబిఎన్ రామకృష్ణ, మారుతీస్వామి, బీరే శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



కదిరి లక్ష్మీనరసింహస్వామి దర్శణానికి బారులుదీరిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) స్వామివారు

ఖాద్రీశుడి దర్శనానికి బారులుదీరిన భక్తులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు ఉత్తర గోపురం ద్వారా దర్శన భాగ్యం కల్పించారు. ఇందులో భాగంగా భక్తులు తెల్లవారుజాము నుంచే బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీవారి చల్లని దీవెనలతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నకున్నట్లు తెలిపారు. సిఎం జగన్‌కు దేవదేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి ప్రజలకు మరింత మంచి చేయాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇఒ గురుప్రసాద్, ఛైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. డిఎస్‌పి భవ్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అర్హులందరికీ పింఛన్లు అందజేయాలి

ఒక్క పింఛన్ కూడా రద్దు కాకుండా చూడండి - వెల్ఫేర్ సెక్రటరీలకు ఛైర్‌పర్సన్ ఇంద్రజ ఆదేశాలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత మీదేనని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ఆయా వెల్ఫేర్ సెక్రటీలను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న 43 సచివాలయాల వెల్ఫేర్ సెక్రటరీలతో పురపాలక సంఘంలో ఇటీవల వివిధ కారణలతో తాత్కాలికంగా రద్దు చేసిన పింఛన్లపై వైస్‌ఛైర్మన్ జబీవుల్లాతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎం జగన్ పార్టీలకతీతంగా అర్హులందరికీ వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించారన్నారు. అయితే ప్రతివార్డులో పింఛన్లు రద్దు అవుతున్నట్లు నోటీసులు ఇచ్చారన్నారు. కావున వాటిని పరిశీలించి అర్హులందరికీ పింఛన్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రంగారావు, ఆర్ఐలు రాము, రామాంజి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఇంద్రజ

నోటీసులను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బడా సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి-కదిరిటౌన్

పట్టణంలోని పట్టణం 20వ వార్డు జడలయ్య మఠంలో 30 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను కూల్చేందుకు మున్సిపల్ అధికారులు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు బడా సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం సర్వే నెంబర్ 504లో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారన్నారు. దీంతో వారు ఇళ్లను నిర్మించుకున్నారన్నారు. అయితే పేదలు మున్సిపల్ స్థలంలో నిర్మించుకున్నారని అధికారులు చెప్పడం ఏంటని నిలదీశారు. 30 ఏళ్ల నుంచి ఇంటి పన్ను, విద్యుత్ బిల్లుల చెల్లింపు, పొజిషన్‌లో ఉంటూ పక్కా గహాలు నిర్మించుకున్నారన్నారు. అలాంటప్పుడు ఇళ్లు కూలుస్తామని నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు జగన్మోహన్, రామ్మోహన్, నాగరాజు, కృష్ణానాయక్, ఫైరోజ్, తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ శ్రీహరిబాబుకి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బడా సుబ్బిరెడ్డి, నాయకులు

మున్సిపాల్టీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మున్సిపాలిటీ అభ్యున్నతికి ప్రత్యేక నిధులు కేటాయించి కూరగాయల మార్కెట్‌లో అధునాతన భవనాల నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కూరగాయల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్‌లో మూడు గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.23లక్షలతో కూరగాయల మార్కెట్‌లో నూతన గదులు కాంప్లెక్స్‌ను నిర్మించామన్నారు. ప్రస్తుతం మూడు గదులను ప్రారంభించామని తెలిపారు. వచ్చేనెలలోపు అన్ని కాంప్లెక్స్‌లను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఆదేశించారు. కూరగాయల మార్కెట్‌ను వచ్చే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మార్కెట్‌కు వచ్చే వారికి సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలని, వాహనాల పార్కింగ్ తదితర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, కమిషనర్ మల్లికార్జున, డిఇ వన్నూరు స్వామి, ఎఇ హరీష్, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, రమాదేవి, అత్తర్ జిలాన్ భాష,గజ్జల శివ,కడపరంగస్వామి, కేత లోకేష్,బ్రహ్మాయ్య, నాయకులు ఉడుముల రాము, రాయపాటి, చాంద్‌బాషా, చెలిమి పెద్దన్న, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ రమేష్, ఎస్‌పి బాషా, సుబహాన్, తదితరులు పాల్గొన్నారు.



మూడు గదుల కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

వరిలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంటలో పంటకోత అధికారులు సోమవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. మండలంలోని సంజీవపురం గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 3లో చంద్రకళ సాగు చేసిన వరి పంటలో ప్రయోగాలు నిర్వహించగా ఆరుకిలోల 300 గ్రాములు దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, ఎఎస్ లక్ష్మీనరసింహ శర్మ, విఎఎ నిఖిత, కుమారి, మహిళా కానిస్టేబుల్ శోభా, ఎస్‌బిఐ బీమా అధికారులు రఫీ, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల అక్రమాలను అరికట్టాలని వినతి

కొత్తచెరువు : మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 384, 392లో ఇచ్చిన ఇళ్లపట్టాల్లో చోటు చేసుకున్న అక్రమాలను అరికట్టాలని సిపిఎం మండల కార్యదర్శి గంగాధర్, మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పుట్టపర్తిలో కలెక్టర్ బసంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలు అరికట్టాలని ఇప్పటికే అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. కావున తక్షణం స్పందించి అక్రమాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కొండగుట్టలో ఇచ్చిన వాటిని తక్షణమే మార్చి అనుకూలమైన చోట ఇవ్వాలని కోరారు.

ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని గుట్టూరు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ముస్లిం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరానారాయణ సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం పెంచిన పెన్షన్ కానుక రూ.2,750 నూతన పెన్షన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదేవిధంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి, జెడ్‌పిటిసి గుట్టూరు శ్రీరాములు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పెన్షన్ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి www.prajasakti.com


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యాసామగ్రి పంపిణీ

కదిరిటౌన్ : పట్టణంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ దాదాపీర్ విజ్ఞప్తి మేరకు సాయిబాబా భక్తులైన అమెరికన్ మమత బరుజ్ నవనీత్ భరూచ్ ప్రత్యూష, గాంబెల్ బర్కరీ, గంబెల్ రాజేష్ పటేల్, ఇషా పటేల్ సహకారంతో 750 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గిరిజమ్మ, ఓంప్రకాష్, కో ఆప్షన్ సభ్యులు అమీర్, పాఠశాల కమిటీ ఛైర్మన్ కవిత, చంద్రమోహన్‌రెడ్డి, మాస్టర్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి ఎస్ఐగా జి.హనుమంతురెడ్డి



కనగానపల్లి : కనగానపల్లి ఎస్ఐగా జి.హనుమంతురెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా సామాజిక న్యాయం, ప్రజల మానవహక్కులను కాపాడేందుకు తమ సిబ్బంది పని చేస్తారన్నారు.

మడకశిర ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

మడకశిర : మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా సోనీబాయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పని చేసేంది. అయితే మూడు నెలల క్రితం ప్రభుత్వం పలువురు ఎంపిడిఒలకు పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోనీబాయిని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నియమించారు. ఈనేపథ్యంలో ఆరోగ్య స్థితిగతులు బాగా లేకపోవడంతో పదోన్నతి వద్దని పాత పదవి కావాలంటూ ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకుంది. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ పాత పదవిలోనే కొనసాగేలా ఉత్తర్వులు వెలువరించడంతో మండకశిర ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు.

టిడిపి బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధిగా సంజీవరాయుడు


పుట్లూరు సంజీవరాయుడు

ధర్మవరం టౌన్ : జిల్లా టిడిపి బీసీసెల్ అధికార ప్రతినిధిగా ధర్మవరానికి చెందిన పుట్లూరు సంజీవరాయుడు ఎంపికయ్యారు. తన ఎంపికకు సహకరించిన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించినందుకు భవిష్యత్తులో టీడీపి బలోపేతంతోపాటు 2024 ఎన్నికలలో పార్టీ గెలుపుకోసం అహర్నిశలు శ్రమిస్తానన్నారు.

వినాయక విగ్రహ ప్రతిష్టాపన

రొద్దం : మండల పరిధిలోని ఆర్.మరవపల్లిలో ఉన్న తహశీల్దార్ కార్యాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా వినాయక విగ్రహాన్ని సోమవారం ప్రతిష్టించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ అనంతాచారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని రొద్దంలోని ఆంజనేయస్వామి, వెంకటరమణ స్వామి ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంతాచారి కుటుంబ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

సోమందేపల్లి : మండల కేంద్రంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే శంకరనారాయణ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.2వేల నుంచి రూ.2,750కు పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, ఇఒఆర్‌డి నాగరాజురావు, సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జడ్పిటిసి డిసి.అశోక్, ఎంపిటిసి నాగప్ప, సర్పంచులు రామాంజనేయులు, గిరిజమ్మ నాగరాజురావు, కిష్టప్ప, లలితా లక్ష్మీనరసప్ప, సోమశేఖర్, పరందామ, తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

హరిరామ జోగయ్య దీక్ష భగ్నం సరికాదు

ప్రజాశక్తి-కొత్తచెరువు


విలేకరులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

కాపు సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీమంత్రి హరిరామ జోగయ్యని అరెస్టు చేయడం బాధాకరమని జనసేన పార్టీ మండల కన్వీనర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 31వతేదీలోపు ఇడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు ఐదుశాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇందుకు నిరసనగా పాలకొల్లు సెంటర్‌లో దీక్ష చేస్తున్న హరిరామజోగయ్యను పోలీసుల అనుమతి తీసుకోలేదని అర్ధరాత్రి అరెస్టు విడ్డూరంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం దీక్షలు అణచివేయాలని చూడటం బాధాకరమన్నారు. 85 సంవత్సరాల వృద్ధుడు దీక్ష చేస్తున్నా ప్రభుత్వ సహకరించడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ఇడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు ఐదుశాతం రిజర్వేషన్ కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు వెంకట్రాముడు, మధు, రెడ్డప్ప, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

భవననిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామంలో లక్ష్మీనరసింహ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం కలెక్షన్ సెంటర్ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ హేమాలత హాజరై భూమిపూజ చేశారు. రూ.15 లక్షలతో నిర్మించనున్న ఈ భవనానికి రైతు సంఘాలకు 75 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఉద్యాన సహాయ సంచాలకులు నరసింహారావు తెలిపారు. రైతులు పంటలు నిలువచేసుకునేందుకు, మార్కెట్ చేసుకునేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నీలిమ, ఆత్మకూరు సర్పంచి వరలక్ష్మి, యాల్లేరు సర్పంచి ఆరోగ్య రెడ్డి, ఎంపీడీవో కొండన్న, ఉద్యాన అధికారి రత్నకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు సుజిత, విజయకుమార్, పెద్దలు అతికిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాలపోతన్న, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఉచితంగా సరుకులు అందించాలి

గుంతకల్లు రూరల్ : సంక్రాంతి పండుగకు ప్రజలకు సరుకులు ఉచితంగా ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు రాముకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ కరోనా వ్యాధి నుండి ప్రజలు ఇంకా కోలుకోలేదన్నారు. నిత్యం కరువులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చిరువ్యాపారాలకు వ్యాపారాలు లేక, వ్యవసాయ కూలీలకు కూలి పనులు దొరక్క, ఇసుక కొరతతో నిర్మాణంగ కార్మికులు, అనుబంధ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పండుగకు సరుకులు కొనుగోలు చేసే స్తోమత పేద ప్రజలకు లేదన్నారు. ప్రభుత్వం చవక దుకాణాల ద్వారా పండుగకు అవసరమయ్యే గోధుమపిండి, బ్యాళ్లు, బెల్లం, నూనె తదితర సరుకులను ఉచితంగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కన్వీనర్ మారుతి ప్రసాద్, నాయకులు జగ్గలి రమేష్, రాముడు నాయక్, బి.తిమ్మప్ప, వై.వీరన్న, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేసి న్యాయం చేయండి..

తహశీల్దార్‌కు బాధితుల వినతి

ప్రజాశక్తి-హిందూపురం


సమస్యను తహశీల్దార్‌కు వివరిస్తున్న బాధితులు

హిందూపురం రూరల్ మండలం కిరికెర పొలం సర్వే నెంబరు 254-1లో 20ఏళ్ల క్రితం అప్పటి తహశీల్దార్ నిరుపేదలకు ఇంటి పట్టాలు అందించారని, అయితే కొంతమంది రెవెన్యూ సిబ్బంది దొంగ పట్టాలు సృష్టించి విక్రయిస్తున్నారని, వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని సూరి, శ్రీనివాసరెడ్డి, శివ కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక స్పందన కార్యాలయంలో తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ మండలం వడ్డిపల్లి గ్రామంలో డ్వాక్ర గ్రూపు లేఅవుట్‌లో హెచ్ఎస్‌డిఆర్ నెంబర్ 118/1409 కొంతమందికి ఇంటి పట్టాలను మంజూరు చేశారన్నారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల వద్ద ఒరిజినల్ పట్టాలు ఉన్నాయన్నారు. అయితే అధికార పార్టీకి చెందిన కొంతమంది రెవెన్యూ అధికారులతో కలిసి దొంగపట్టాలు సృష్టించి విక్రయిస్తున్నారన్నారు. దీనిపై సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ విచారించి అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఎపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని మండల విద్యా శాఖ కార్యాలయంలో సోమవారం ఎపిటిఎఫ్ క్యాలెండర్ ను ఎంఇఒ గంగప్ప, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ పెనుకొండ మండల అధ్యక్షులు యం.రుద్రేష్, ప్రధాన కార్యదర్శి జి.రామాంజినేయు లు, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు డి.రంగేష్‌కుమార్, కరణం రఘునాథరావు, జి.సి.వేంకటేశులు, ఎస్.లక్ష్మేనాయక్, ఎస్.ఎం.డి.యాఖూబ్, జి.గోపాల్, చంద్రశేఖర్, గంగప్ప, వి.వెంకటేష్, పి.జి.రఘునాథ, రఘునందన్, జితేంద్ర, షోహిల్ అహ్మద్, రజనీకాంత్, సంజివప్ప, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక ఎంఆర్‌సి భవన్‌లో సోమవారం ఎపిటిఎఫ్ రూపొందించిన నూతన క్యాలెండర్, డైరీలను ఎంఇఒ కృష్ణానాయక్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఎడి, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, రమణారెడ్డి, రమేష్, సాయి, మాధవి, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి

ప్రజాశక్తి-హిందూపురం


బుక్కపట్నంలో స్వామివారిని దర్శించుకుంటున్న కలెక్టర్ దంపతులు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవాడానికి భక్తులు బారులుదీరారు. ఈఆలయంతోపాటు పట్టణంలోని లక్ష్మీపురంలో వెలసిన వెంకటేశ్వరస్వామి, గుడ్డం రంగనాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ పేట వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. లక్ష్మీపురం ఆలయంలో అన్నదానం కోసం వైసిపి నేత కొండూరు వేణుగోపాల్ రెడ్డి, అతని కుమారుడు హనీష్‌రెడ్డి రూ.25వేలు అన్నదానం చేశారు.

బత్తలపల్లి : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మండలంలోని పోటమ్రి ఆంజనేయస్వామి, శివాలయం, ముష్టూరు శివాలయం, ఆంజనేయస్వామి, గంటాపురం అప్పస్వామి, సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరుని క్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రం, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, జ్వాలాపురం లక్ష్మీనరసింహ దేవాలయం, రామాపురం, మాల్యవంతం వీరనారాయణస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దంపెట్లలో యువత ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూజల్లో ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, ఎంపిపి గుర్రం వనజ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బయపరెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని అతి పురాతనమైన లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు హరిస్వామి, గురుస్వామీలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసంత్‌కుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శించుకుని ఉత్తర ద్వారా ప్రవేశం చేశారు.

పెనుకొండ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని ఐముక్తేశ్వర స్వామి ఆలయంలో పరమేశ్వరున్ని, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే శంకరనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీఘనగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి కుటుంబ సమేతంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, సీనియర్ నాయకులు బొక్కసంపల్లి రామకృష్ణప్ప, నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు చిన్నప్పయ్య, ఉపాధ్యక్షులు రామలింగ, మండల కన్వీనర్ సిద్దయ్య, మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, రొద్దం మండల ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోయ గాయత్రి, తోటగెరి శ్రీనివాసులు, దోని లక్ష్మీనారాయణ, బోయ అనిల్ కుమార్, నంజుండ, రమణమ్మ, శివ, రాము, చంద్రమౌళి, జిరాక్స్ శ్రీనివాస్, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమడుగూరు : ముక్కోటి ఏకాదశిని పురస్కరించు కుని సోమవారం మండలవ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమడుగూరు చౌడేశ్వరీదేవి, కోదండ రామస్వామి అభయాంజనేయ స్వామిచ పిచ్చిలకొండ వీరాంజనేయస్వామి, షిరిడీ సాయిబాబా, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో అభిషేకాలతో విశేష పూజలు నిర్వహించారు.

ధర్మవరం టౌన్ : ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో భక్తులో కిటకిటలాడాయి. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున నుంచి స్వామివారి దర్శణానికి భక్తులు బారులుదీరారు. ఉదయం స్వామివారి కల్యాణోత్సవం అదేవిధంగా కొత్తపేట, శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర, దక్షిణ ద్వార ప్రవేశాలు కల్పించారు. శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చెన్నంశెట్టి జగదీష్, ప్రధానకార్యదర్శి జింకారాజేంద్రప్రసాద్ తదితరులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో అన్నమయ్య సేవా మండలిసభ్యులు పొరాళ్లపుల్లయ్య బృందం కచేరీలు, అన్నమయ్య సంకీర్తనలు గావించారు. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల వద్ద సీఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలో ఉన్న గౌని పల్లి గ్రామంలో శ్రీ కోదండ రామాలయం లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా పబ్బిశెట్టి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ రామచంద్ర స్వామి కుటుంబ సమేతంగా విగ్రహాలకు , పట్టు వస్త్రాలు సమర్పించి, 3000 విలువగల వెండి నామాలు, వెండి కన్నులు ఆలయ అర్చకులు పంచరత్న సురేష్ శర్మ గారికి అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో సీతారామయ్య , పుష్పవతి, వెంకటనారాయణ, పద్మ దంపతులు పాల్గొన్నారు,ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ కోదండ రామాలయం లో గ్రామ పెద్దలు, యువసేన ఆధ్వర్యంలో, ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వారం వద్ద ఉత్సవ విగ్రహాలకు వివిధ పూలతో అలంకరించి , పల్లకిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తచెరువు : మండల పరిధిలోని ఇల్ల వెంకటంపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం సోమవారం కన్నుల పండువగా సాగింది. ఆలయం నిర్మించి పది సంవత్సరాలు పూర్తవుతున్నందున ఆలయ ధర్మకర్తలు ఉషారాణి చెన్నారెడ్డి ఆలయానికి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణతోపాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిఐ జయనాయక ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


హిందూపురంలో స్వామివారి దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు


ధర్మవరం చెన్నకేశవస్వామి దేవాలయంలో సంకీర్తనలు పాడుతున్న అన్నమయ్యసేవా మండలి సభ్యులు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ యునియన్ పుట్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సర్కిల్ నందు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పుట్లూరు మండలంలో అనేకమంది భవన నిర్మాణ పనుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కార్మికుల కడుపుకొట్టే విధంగా ఉన్నాయన్నారు. భవన నిర్మాణానికి ఉపయోగించే, ఐరన్, సిమెంట్, పెయింట్స్ ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు. అందరికీ ఇసుకను అందుబాటులోకి తేవాలని, ప్రతి భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వయసుతో సంబంధం లేకుండా ప్రతి కార్మికునికి కార్మిక భృతి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు వలెపు హరి, కార్యదర్శి వి.వెంకటశేఖర్, నాయకులు సురేష్, గోవింద్, రాఘవ ఆచారి, కార్మికులు పెద్దిరాజు, కుళ్లాయప్ప, సుబహాన్ పాల్గొన్నారు.

నేడు లైవ్ సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపుర కలెక్టరేట్ : స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోషియేషన్, అనంతపురం జిల్లా బ్రాంచి ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోం ప్రాంగణంలోని పెన్షనర్స్ భవన్ నందు మంగళవారం లైవ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, నమోదు చేస్తున్నట్లు పెన్షనర్స సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, శీలా జయరామప్ప, కోశాధికారి జి.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన్ ప్రమాణ్ పోర్టల్ నందు, బయోమెట్రిక్, ఐరిష్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేస్తామన్నారు. అక్‌నాలెడ్జిమెంట్ ఇస్తామని చెప్పారు. ఈ సదుపాయం ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా పెన్షనర్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాన్యువల్ వెరిఫికేషన్ ధ్రువపత్రాలను ఎస్‌టిఒ కార్యాలయంలో గాని, ఆన్‌లైన్ సర్వీసు ఉన్న చోట గాని జీవన్ ప్రమాణ్ పోర్టల్ నందు బయోమెట్రిక్, ఐరిష్, ఫేస్ యాప్‌ల ద్వారా ఇవ్వవలసిఉంటుందన్నారు. యాన్యువల్ వెరిఫికేషన్ ధ్రువపత్రం ఇవ్వడానికి వచ్చే వారు... వారివెంట పిపిఒ కాపీ, ఆధార్ కార్డు, ఈమెయిల్ ఐడి, ఆధార్ లింక్డ్ సెల్ పోన్, సిఎఫ్ఎంఎస్ నెంబరు పాస్‌వర్డ్ తప్పక తీసుకురావాలని తెలియజేశారు.

వైసిపి పాలనలో అన్నివర్గాలకూ అన్యాయం

ప్రజాశక్తి-గుత్తి

వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేందర్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ రూ.8 లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు రైతులకు పెద్దపీట వేశారన్నారు. వైసిపి మూడున్నరేళ్ల పాలనలో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైందన్నారు. పాఠశాలలు విలీనం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులతోపాటు అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సీఎం జగన్‌పై ఆగ్రహంతో ఉన్నారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆర్.హరినాథ్ గౌడ్, మండల పట్టణ, కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్ గౌడ్, టౌన్ బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్దుల్ జిలాన్, కృష్ణ, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి మాజీ ఎంపీపీ వీరేష్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, నాయకులు భాస్కర్ స్వామి, వంకాయల శీనా, అగ్గి రాముడు, హనుమంతరెడ్డి, భోగాంజనేయులు, రమేష్, రామమూర్తి, గద్దల మస్తాన్, మాజీ కౌన్సిలర్ కె.గోవిందు, మాజీ సర్పంచులు తిరుపాలు, వెంకటరాముడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య


మృతిచెందిన లక్ష్మమ్మ

నల్లచెరువు : మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ సమీపంలో సోమవారం పి.లక్ష్మమ్మ(86) సోమవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ రహీం తెలిపిన వివరాల మేరకు అల్లుగుండు గ్రామానికి చెందిన అక్కులప్ప భార్య పి.లక్ష్మమ్మ ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

నల్లచెరువు : మండల పరిధిలోని తలమర్ల వాండ్లపల్లి పంచాయతీలోని రమణప్పగారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన విఆర్ఎ రమణప్ప (52) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఈయన నల్లచెరువు మండల తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఎగా విధులు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో అనారోగ్యంతో ఆదివారం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

మున్సిపల్ కార్మికుడు మృతి

పుట్టపర్తి అర్బన్ : మున్సిపల్ కార్మికుడు మహమ్మద్ తాజ్‌బాబా అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ మేనేజరు ఆసీఫ్ మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు మరుట్ల శ్రీలక్ష్మి, మాతాంగి తిప్పన్న తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం తక్షణ సాయం కింద మృతుని భార్యకు రూ.15 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలోని రాజేంద్రనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో నివాసం ఉంటున్న మస్తాన్ భార్య నాగప్రభ కుటుంబ సమస్యలతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

దేవగిరిలో పట్టపగలే ఇంట్లో చోరీ

బొమ్మనహాల్ : బొమ్మనహాల్ మండలం దేవగిరి గ్రామంలో పట్టపగలే ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. దేవగిరి గ్రామానికి చెందిన కూలూరు వసంతకుమార్ సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి తోటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. దుండగులు ఇంట్లోని బీరువా పగులగొట్టి రూ.6 లక్షలు విలువజేసే బంగారు నక్లెస్, ఒక చైను, కమ్మలు, జుంకీలు, రూ.25 వేలు నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాక్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేశారు. ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళం

గోరంట్ల : మండలంలోని గుంతపల్లి గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, సర్పంచ్ సువర్ణమ్మ దంపతులు రూ.10,116 విరాళం అందజేశారు. అలాగే మందలపల్లి పంచాయతీ జౌకలదిన్నె గ్రామానికి చెందిన చందమూరి సుబ్బారెడ్డి రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు ఈ కార్యక్రమంలో సర్పంచి నర్సిరెడ్డి, పెద్ద రంగారెడ్డి, మహేష్, వెంకటరెడ్డి, సదాశివారెడ్డి, ఓబులరెడ్డి, జయచంద్రారెడ్డి, హేమసుందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాబ్‌లు పంపిణీ

పెనుకొండ : మండలంలోని మావటూరు హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు పెనుకొండ వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, సర్పంచి నాగరాజు, ఎంపిటిసి శివయ్య సోమవారం టాబ్‌లు పంపిణీ చేశారు. అందజేశారు. అనంతరం పెంచిన పెన్షన్ కానుక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, డీలర్ మారెన్న, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని పులేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు సోమవారం సర్పంచ్ ప్రభాకర్ రావు విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 15000 విలువగల ట్యాబు ఒక్కొక్క విద్యార్థికి పంపిణీ చేస్తుందన్నారు విద్యార్థులు ట్యాబులను సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వర్ ప్రసాద్ ఉప సర్పంచ్ శ్రీనివాసులు హైదర్ వలీ స్కూల్ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ట్రెజరీలోనే లైవ్ సర్టిఫికెట్ జారీ చేయాలి

ధర్మవరం టౌన్ : ధర్మవరం తాలూకా పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు వారిలైవ్ సర్టిఫికెట్లను ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు చలపతి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

బుక్కరాయసముద్రం : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండలశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్, డైరీలను ఎంఇఒ గురుప్రసాద్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ముందుంటుందన్నారు. గత సంవత్సరం జీవోలను అధ్యాపక దర్శిని ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ డైరీలో ఉపాధ్యాయులకు సంబందించిన అనేక సందేహాల నివృత్తి, పిఆర్‌సి జిఒలు, టైమ్‌స్కేలు, ముఖ్యమైన వారి ఫోన్ నెంబర్లు ఉన్నాయని, ఇది అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, హెన్రీమార్క్, మహమ్మద్ గౌస్, సాధిక్, సీతారామరెడ్డి, జగదీష్, మస్తాన్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులను మార్చే సంస్కృతి టిడిపిదే

ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం : అసెంబ్లీ ఎన్నికల్లో తరచూ అభ్యర్థులను మార్చే సంప్రదాయం తెలుగుదేశం పార్టీదేనని రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఇటీవల కాలవ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం స్థానానికి తానే అభ్యర్థినని, రామచంద్రారెడ్డికి టికెట్ వస్తుందో లేదో అని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. 2009, 2012, 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో తానే కాంగ్రెస్, వైసిపి అభ్యర్థిగా రాయదుర్గం స్థానానికి పోటీ చేశానన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికలు కూడా రాయదుర్గం స్థానానికి తానే పోటీలో ఉంటానన్నారు. అయితే తెలుగుదేశం పార్టీకి గతంలో జరిగిన నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిసారీ వేర్వేరు అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. అలా అభ్యర్థులను మార్చే సాంప్రదాయం తెలుగుదేశం పార్టీలోనే ఉందన్నారు. కుప్పంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా టిడిపి ఘోరంగా ఓటమి పాలైందన్నారు. మంగళగిరిలో లోకేష్, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులుకు పరాజయం తప్పలేదన్నారు. సీఎం జగన్ చెప్పినట్లు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాలను వైసిపి గెలుచుకుంటుందని అన్నారు. ప్రజల్లో వైసిపికి, జగన్ కు, తనకు ప్రజల హృదయాల్లో స్థానం ఉందన్నారు. కాలవ శ్రీనివాసులు పప్పులు ఉడకవన్నారు. ఆయనకు రాయదుర్గంలో నూకలు చెల్లాయన్నారు. ఇది వైకాపా అడ్డా అని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో కాలవ శ్రీనివాసులుకు టిడిపి టికెట్ వస్తుందో రాదో అని సందేహం వ్యక్తం చేశారు. ఒకవేళ వచ్చినా ఘోర పరాజయం తప్పదన్నారు.